సన్నగిల్లుతున్న ఆశలు

- ఊరించి ఉసూరుమనిపిస్తున్న వరుణుడు
- ఖరీఫ్ తొలకరి వర్షంతో పంటల సాగు
- విత్తనం వేశాక ముఖం చాటేసిన వాన
- అయోమయంలో అన్నదాతలు
- వర్షం కోసం ఎదురుచూపు
- కొలిమిగుండ్ల మండలంలో 2,500 హెక్టార్లకు గాను 557కు పరిమితం

రోజు ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుంటున్నా చిరుజల్లులు తప్ప భారీ వర్షం కురవడం లేదు. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు దాటినా చాలా వరకు పొలాల్లో విత్తనం పడడం లేదు. వేసిన అరకొర పంటలు కూడా వాడుముఖం పడుతున్నాయి. జూన్ నెలలో మోస్తరు వర్షాలు కురవడంతో రైతులు ఎంతో ఆశతో పొలాలు దుక్కి దున్నుకుని ఖరీఫ్‌లో పలు రకాల పంటలు వేశారు. తీరా విత్తనం వేశాక వర్షం ముఖం చాటేయడంతో డీలాపడ్డారు. గాలుల ప్రభావంతో భూమిలో ఉన్న అరకొర తేమ శాతం ఆరిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



మీర్జాపురం సమీపంలో సాగు చేసిన కంది పంట

కొలిమిగుండ్ల: ముందుస్తుగా తొలకరి వర్షాలతో పలకరించి ఆశలు రేకెత్తించిన నైరుతి చివరకు ముఖం చాటేసింది. జూన్ నెలలో సాధారణ వర్ష పాతం 68.4 మి.మీ కాగా ఏకంగా 173 మి.మీ వర్ష పాతం కురిసింది. అయితే విడతల వారీగా మోస్తరు వర్షం మాత్రమే కురిసింది. ఖరీఫ్‌కు సంబంధించి పదును కావడంలో సమయం మీరిపోతుందని రైతులు ఆత్రుతతో తేమలోనే సాగు చేపట్టారు. జూలైలో సాధారణ వర్షపాతం 100.7 మి.మీ కాగా ఇప్పటి వరకు 57.4 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఈనెలలో 50 శాతం లోటు వర్షపాతం ఉంది. వాగులు, వంకలు దొర్లకపోవడంతో చెరువుల్లో నీళ్లు లేక వెలవెలబోతున్నాయి.

ముందుకు సాగని సాగు

బనగానపల్లె నియోజవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, సంజామల మండలాల్లో సాగునీటి వనరులుండగా ఒక్క కొలిమిగుండ్ల మండలంలో మాత్రమే కేవలం బోరుబావులు, వర్షాధారం కింద మాత్రమే అన్నదాతలు పంటలు పండిస్తుంటారు. ఈ ఖరీఫ్‌లో ఆశించిన వర్ష పాతం లేకపోవడంతో సాగు ముందుకు కదలడం లేదు. ఇప్పటికే చాలా మంది రైతులు విత్తనం వేయకపోవడంతో పొలాలు బీళ్లుగా కనిపిస్తున్నాయి. ఈఖరీఫ్‌లో సాధారణ సాగు 2,500 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 557 హెక్టార్లలో మాత్రమే సాగులో ఉంది. కంది, ఆముదం, మినుము, పత్తి సాగు చేశారు. ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పత్తి సాగు గణనీయంగా తగ్గిపోయింది. 300 హెక్టార్లకు పైగానే సాగులో ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 80 హెక్టార్లకే పరిమితమైంది. పది రోజుల్లో వరుణుడు కరుణించకపోతే పంటలు వాడుముఖం పట్టే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం ఈ ఖరీఫ్‌లో సాధారణ సాగు 2,500 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు వర్షాధార, నీటి పారుదల కింద కంది 150 హెక్టార్లు, ఆముదం 46, పత్తి 80, మినుము 84, మొక్కజొన్న 117 హెక్టార్లు సహా వివిధ పంటలు కలిపి మొత్తం 557 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పత్తి సాగు గణనీయంగా తగ్గిపోయింది. 300 హెక్టార్లకు పైగానే సాగులో ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 80 హెక్టార్లకే పరిమితమైంది.

కొలిమిగుండ్ల మండలంలో వర్షపాతం వివరాలు

జూన్‌లో సాధారణ వర్షపాతం	:68.04 మి.మీ
నమోదైన వర్షపాతం	:173 మి.మీ
జూలైలో సాధారణ వర్షపాతం	:100 మి.మీ
ఇప్పటి వరకు నమోదైంది	:57.04
ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం	:2500 హెక్టార్లు
ఇప్పటి వరకు సాగైంది	:557 హెక్టార్లు
పంటలు	:కంది, పత్తి, మినుము, ఆముదం

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం



జూన్‌లో వర్షాలు కురవడంతో పదును ఉందని భావించి ఆరు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. ఈనెలలో చిరుజల్లులు తప్ప భారీ వర్షం కురవలేదు. వరుణదేవుడి కోసం ఎదురుచూస్తున్నాం. గాలులు ఎక్కువగా వీస్తుండడంతో అరకొర పదును ఆరిపోయే ప్రమాదముంది. కొద్ది రోజుల్లో వాన కురవకపోతే పంట ఎండిపోయే ప్రమాదముంది.

–నారాయణరెడ్డి, రైతు, మీర్జాపురం

బీళ్లు పెట్టుకున్నాం



ఆశించిన వర్షం కురవకపోవడంతో పొలాలను బీళ్లుగా పెట్టుకున్నాం. 14 ఎకరాల్లో మినుము, కంది వంటి పంటలు వేయాలని సిద్ధం చేసుకున్నాం. కురిసిన అరకొర వర్షం వల్ల చాలా మంది పంటలు వేసేందుకు వెనకడుగు వేశారు. రెండు మూడు రోజుల్లో వాన కురిసినా పంటలు వేయాలనుకుంటున్నాం.

–ఈశ్వరయ్య, రైతు, నాగిరెడ్డిపల్లె

క్లుప్తంగా

సాంబ శివాలయంలో ప్రత్యేక పూజలు



డోన్: ఆషాడమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సాంబ శివాలయంలో ప్రధాన అర్చకుడు క్లై శేషావలి శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లాడ్జీల్లో తనిఖీలు



లాడ్జీలో ఉన్నవారి వివరాలను ఆరా తీస్తున్న సీఐ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని పలు లాడ్జీలను సీఐ గంటాసుబ్బారావు సోమవారం తనిఖీ చేశారు. గదులు తీసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గదులు ఇచ్చే సమయంలో వారి ఆధార్, చిరునామా తదితర వివరాలు తీసుకోవాలని యజమానులకు సూచించారు. అనంతరం పట్టణంలోని జీఎం టాకీస్ నుంచి ఆస్థానం రోడ్డు పాతబస్టాండ్ వరకు రోడ్డులో ట్రాఫిక్‌ను పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు, దుకాణాల యజమానులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పోలీసు వారు సూచించిన వైపు మాత్రమే వాహనాలను పార్కు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ద్విచక్రవాహనం దగ్ధం



దగ్ధమైన ద్విచక్రవాహనం

ప్యాపిలి: మండల పరిధిలోని పోదొడ్డి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనం (హోండా షైన్) దగ్ధమైంది. గ్రామానికి చెందిన గద్దల బాలరంగన్న ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ఆవరణలో పార్కింగ్ చేశాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా ద్విచక్రవాహనం దగ్ధమైనట్లు గుర్తించాడు. ఈ మేరకు ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని దగ్ధం చేశారా లేక ప్రమాదవశాత్తు దగ్ధమైందా?.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి.. భర్తపై కేసు నమోదు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో భార్యపై దాడి చేసిన భర్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వరప్రసాద్ వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన రాజేశ్వరి, కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తికి చెందిన పుల్లయ్యతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా ఏడాది నుంచి దంపతులు దూరంగా ఉంటున్నారు. సోమవారం భార్య, భర్తల మధ్య పంచాయతీ చేసేందుకు రాజేశ్వరి పిన్ని దేవిని పిలుచుకుని గుళ్లదూర్తికి వచ్చింది. పంచాయతీ సమయంలో వాగ్వాదం చోటు చేసుకుని పుల్లయ్య భార్య, వరుసకు అత్త అయిన దేవిపై దాడి చేసి గాయపరిచాడు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నీటి కుంటలో జాలరి గల్లంతు

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన చాపల జాలరి నీటి కుంటలో గల్లంతయ్యాడు. సోమవారం స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బాల దస్తగిరి ఆదివారం సాయంత్రం పట్టణ శివారులోని గుంజలపాడు రహదారి పక్కన ఉన్న నీటి కుంటలో చేపలు పట్టేందుకు బైక్‌పై వచ్చాడు. కుంట గట్టున బైక్ ఆపి చెప్పులు, బట్టలు విడిచి కుంటలో దిగాడు. కుంటలో పూడిక ఎక్కువగా ఉండడంతో నీట మునిగిపోయి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న బంధువులు బాలదస్తగిరి ఆచూకీ కోసం కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు.

ఉమామహేశ్వరునికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకశిలా రూపంలోని శివ పార్వతులకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పశువులకు వ్యాధినిరోధక టీకాలు



సంజామలలో రికార్డులను పరిశీలిస్తున్న డీడీ వెంకట రమణయ్య

సంజామల: సీజనల్ వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఆళ్లగడ్డ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకట రమణయ్య అన్నారు. సోమవారం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లడుతూ.. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. వ్యాధి నిరోదక టీకాలను సకాలంలో పశువులకు అందించి సీజనల్ వ్యాధుల భారి నుంచి విముక్తి కలిగించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జేవీఓలు సుబ్బయ్య, శ్రీను, బాషా, మహబూబ్ బేక్, ప్రభాకర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



ఎన్జీఓ కాలనీలో భోజనం చేస్తున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం బనగానపల్లె ఎన్జీవో కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఎంఈఓ సొంత ఖర్చుతో శుభ్‌దిన్ భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు, యూనిఫాం వంటివి అందజేస్తామని.. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే పాతపాడు ఎంపీపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా సర్పంచ్ బి మహేశ్వరరెడ్డి సహకారంతో విద్యార్థులకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం శ్రీదేవి, సుబ్రమణ్యం, స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ

- ఇరువురు డ్రైవర్లకు గాయాలు

కొలిమిగుండ్ల: రాఘవరాజుపల్లె–అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి రెండు లారీలు ఢీకొన్నాయి. తమిళనాడుకు చెందిన లారీ తాడిపత్రి నుంచి బనగానపల్లె వైపు వెళుతోంది. అదే సమయంలో కొలిమిగుండ్ల వైపు నుంచి వెళుతున్న మరో లారీ రాఘవరాజుపల్లె సమీపంలోని చౌడేశ్వరిదేవి ఆలయం వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ తైలావన్ వాహనంలో ఇరుక్కుపోయాడు. పోలీస్ రోడ్డు సేఫ్టీ వెహికల్ సిబ్బంది డ్రైవర్‌ను బయటకు తీశారు. మరో లారీ డ్రైవర్ నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరిని 108 వాహనంలో అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

కొలిమిగుండ్ల: శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బోధన, సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంఈఓ అబ్దుల్‌కలాం తెలిపారు. కార్యక్రమం చివరి రోజు దాతల సహకారంతో పాఠశాల విద్యార్థులు, తల్లి తండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో నాలుగైదు పాఠశాలలు మినహా అన్ని పాఠశాలల్లో దాతల సాయంతో భోజనాలు ఏర్పాటు చేయించామన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు దాతల సహకారంతో ప్రత్యేక వంటకాలు చేయించినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం పాటు రోజుకొక కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు

బేతంచెర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మద్దిలేటి నరసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈఓ రామాంజనేయులు సహకారంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజనాలు వడ్డించారు. పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్రహం, హనుమాన్‌నగర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

పింఛన్ సాయం పెంచండయ్యా



భార్య సుశీలమ్మతో దిబ్బన్న

ఈ ఫొటోలో కనిపిస్తున్న దిబ్బన్న, సుశీలమ్మ దంపతులది బెలుం గ్రామం. నాపరాతి గనుల్లో పని చేసే సమయంలో ప్రమాదవశాత్తు దిబ్బన్న చూపును కోల్పోయాడు. అడుగు తీసి అడుగు వేయాలన్నా భార్య తోడు ఉండాల్సిందే. దాదాపు ఐదేళ్ల నుంచి సాధారణ పింఛన్ పొందుతున్నాడు. తనకు రెండు కళ్లు కనిపించడం లేదని.. దివ్యాంగుల పింఛన్ కింద రూ.6వేలు మంజూరు చేయాలని సోమవారం భార్యతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డిని కలిసి విన్నవించుకున్నాడు. తనకు కళ్లు కనిపించకపోవడంతో పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయాడు. భార్య కూలి పనులకు పోతుంటే వచ్చే డబ్బుతో సరిపోక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

–కొలిమిగుండ్ల

అమ్మ భౌబోయ్



టీచర్స్ కాలనీలో సంచరిస్తున్న కుక్కలు

డోన్ టౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కొద్ది నెలల క్రితం కొండముచ్చు కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన మరువక ముందే సుందరసింగ్ కాలనీ, పట్టణ పోలీస్‌స్టేషన్, కొత్తపేటతో పాటు పట్టణంలోని పలు కాలనీల్లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచాయి. పట్టణ ప్రజల్లో భయాందోళన తొలగక ముందే కొద్ది రోజులుగా పట్టణంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. పిల్లలు వీధిలో ఆడుకునే సమయాల్లో, స్కూల్‌కు వెళ్లి వచ్చే సమయాల్లో తల్లిదండ్రులు కాపలా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను తీర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రేపు నగర పంచాయతీ సాధారణ సమావేశం

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు సోమవారం తెలిపారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి వార్డు కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు. నగర పంచాయతీ సమస్యలు, అభివృద్ధిపై చర్చ ఉంటుందని తెలిపారు.

బైండోవర్ కేసు నమోదు

ప్యాపిలి: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన చెంచుగారి శంకర్‌పై సోమవారం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు. నిందితుడు కొద్ది రోజులుగా ఎస్సీ కాలనీలో పలువురితో అసభ్యంగా ప్రవర్తిస్తునట్లు ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు చెప్పారు.

వ్యక్తిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్ల కుంట గ్రామానికి చెందిన దయ్యాల దశరథుడుపై పాత గొడవలను మనసులో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, పామయ్య, శంకర్ గొడ్డలి, కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రోఖరప్ప తెలిపారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం లారీ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం జుల్‌పాల్య గ్రామానికి చెందిన యాతం విజయ్‌కుమార్(27) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సిమెంట్ లోడ్ కోసం రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చాడు. లోడింగ్ కాకపోవడంతో యార్డు వద్ద లారీని పార్కింగ్ చేసి క్యాబిన్‌లో నిద్రపోయాడు. ఎంతకూ లేవకపోవడంతో ఇతర లారీ డ్రైవర్లు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డ్రైవర్ మృతిపై కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

డోన్ టౌన్: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్ గాయపడినట్లు ఏఎస్‌ఐ భాస్కర్ సోమవారం తెలిపారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపునకు తమిళనాడు, హర్యానా రాష్ట్రాలకు చెందిన లారీలు వెళుతుండగా డోన్ పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వెంకటాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. తమిళనాడుకు చెందిన లారీని హర్యాణకు చెందిన లారీ డ్రైవర్ అమీర్‌ఖాన్ ఢీకొనడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. గుర్తించిన స్థానికులు తాళ్ల సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న రైతులు

కోవెలకుంట్ల: ఆయిల్‌పామ్ సాగు రైతులకు అన్ని విధాలా లాభదాయకమని కోవెలకుంట్ల ఉద్యాన వన శాఖ అధికారిణి ధరణి సూచించారు. సోమవారం మండలంలోని జోళదరాశి గ్రామానికి చెందిన యుగంధర్‌రెడ్డి అనే రైతు పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు సరఫరా చేస్తుందని, మొక్కల సంరక్షణకు ఏడాదికి రూ. 4వేల చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన పొలంలో ఇతర పంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని కలుగొట్ల రైతు భరోసా కేంద్రంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేసే పతాంజలి సంస్థ మేనేజర్ మహదేవ, ఉపాధి పథక ఈసీ మగ్బుల్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ జయరాం

డోన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జయరాం అన్నారు. సోమవారం డోన్‌లోని డేవిడ్ నగర్, మాధన్న నగర్‌లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వర్షాకాలంలో దోమల వల్ల డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. తడి, పొడి చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని స్థానికులను కోరారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో విధ్వంస పాలన

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: రాష్ట్రంలో అరాచక, విధ్వంస పాలన సాగుతోందని.. రాజకీయ దాడులు, హత్యలు పేట్రేగిపోయాయని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ 50 రోజుల పాలనలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. వినుకొండ సంఘటన యావత్ రాష్ట్రాన్ని భయందోళనకు గురిచేసిందని తెలిపారు. ఆరాచక పాలనకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఎంపీలు సంఘీభావం తెలిపారని చెప్పారు.

సూపర్‌సిక్స్ హామీలు ఏమయ్యాయి?

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 50 రోజులైన అమలుపై ప్రకటన చేయకపోవడం ప్రజలను వంచించడమేనని పేర్కొన్నారు. ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. వారి మాటలు నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని.. ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

పింఛన్ మినహా ఏ పథకంపై ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నెల దాటినా పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థి తల్లికి రూ.15 వేల చొప్పు అందిస్తామన్న హామీ ఏమైందన్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా ఊసెత్తడం లేదని విమర్శించారు. తల్లిదండ్రులు పిల్లల ఫీజులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైఎస్ జగన్ పాలనలో ఈ పథకం ద్వారా ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా 43 లక్షల తల్లులకు రూ.26.67 వేల కోట్లు జమ చేశారన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు రూ.1500, నిరుద్యోగ భ్రుతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్ల నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పింఛన్ అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

డోన్ టౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. సమాజంలో లింగ వివక్ష రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భ్రూణ హత్యల నివారణ కమిటీ సభ్యుడు, సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి సామాజిక బాధ్యత అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రామాంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాబానాథ్

బనగానపల్లె రూరల్: జాతీయ జంతువు పెద్ద పులిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాబునాథ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పులుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 1913లో ప్రపంచంలో సుమారు లక్ష పులుల ఉండేవని.. ప్రస్తుతం వీటి సంఖ్య సుమారు 5,574 మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో వీటి సంఖ్య 90 శాతం తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ.. 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరిగిన టైగర్ సమ్మిట్ నిర్ణయం మేరకు అంతర్జాతీయ పులుల దినోత్సవం భారత్, నేపాల్, టర్కి, భూటాన్, రష్యా తదితర దేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పులులు, ఇతర జంతువుల వల్ల పర్యావరణ సమతుల్యం ఉంటుందని.. వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధ్యాపకులు రామకృష్ణ, వహిదా తదితరులు పాల్గొన్నారు.